పొట్ట దశలో వరి.. నీరందక రైతన్న వర్రీ!

- కౌతాళం మేజర్ కాలువ కింద పొలాలకు నీరు వదలని వైనం
- ప్రస్తుతం పొట్టదశలో వరిపంట
- నీరందక ఎండుముఖం పట్టిన పైరు
- ఒక్కతడి నీరు కోసం రైతుల ఎదురు చూపులు


పొట్టదశలో ఉన్న వరిపైరు (ఇన్‌సెట్) నీళ్లు లేక పగళ్లు ఇచ్చిన నేల

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ కింద సాగు చేసిన ప్రధానమైన వరి పంటకు సాగునీరు అందక కళ్ల ముందే ఎండిపోతుంటే రైతన్నలు గుండెలు మండుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉండడంతో మార్చి చివరి వరకు సాగునీరు అందిస్తామని టీబీపీ బోర్డు అధికారులు ప్రకటించారు. దీంతో రబీ సీజన్‌లో కూడా వరి పంటలు సాగు చేసుకున్నారు రైతులు. అయితే తుంగభద్ర దిగువ కాలువకు కూతవేటు దూరంలో రాజనగర్ క్యాంపు వద్ద కౌతాళం మేజర్ కాలువ కింద ఆయకట్టుకు నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పంట పొట్టదశలో ఉండడంతో ఒక్కతడి ఇస్తే చాలని నీటి కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పగళ్లు ఇచ్చిన భూమి ఆందోళనలు రైతులు

ఎల్లెల్సీ కౌతాళం మేజర్ కావుల కింద 350 ఎకరాలు వరి సాగు చేశారు. అయితే దాదాపు 50 ఎకరాలకు నీరందడంలేదు. నీరు లేక భూమి పగళ్లు ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌతాళం మేజర్ కాలువకు పక్కనే ఉన్న తమకు సాగునీరు వదలకుండా అధికారులు డబ్బు తీసుకొని దిగువన ఉన్న పొలాలకు కోసం సాగునీరు వదులుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తమ పొలాలకు నీటి కోసం ఎకరాకు రూ.800 ప్రకారం చెల్లించుకున్నా నీరు వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నాయకుల దృష్టికి తీసుకెళ్తే వారు ఫోన్‌లో మాట్లాడిన రోజు మాత్రమే నీరు వస్తాయని, మరుసటి రోజు నీరు రావడం లేదన్నారు. గట్టిగా అడిగితే వారబందీ అంటూ వారినికి రెండున్నర రోజుల పాటు సాగునీరు బంద్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పంట పొట్టదశలో ఉండడంతో చివరి తడి నీరు ఎంతో అవసరమని, నీరు అందక పోతే పంట పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో సాగు అయిన మిరప పంట పూర్తిగా దెబ్బతిని ధర లేక లక్షల్లో అప్పులు మిగిలాయని ఇప్పుడు వరి పంట కూడా దెబ్బతింటే కనీసం తినడానికి తిండి లేక ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని వాపోయారు.

మూడు ఎకరాల్లో సాగుచేశాను



వరి పంటను మూడు ఎకరాల్లో సాగుచేశాను. ఇప్పటికే పెట్టుబడి ఎకరాకు రూ.30వేల వరకు ఖర్చు చేశాను. పంట పొట్టదశలో ఉంది ఇప్పుడు చివరి తడి నీరు కావాలి. ఇప్పుడు నీరు అందక పోతే పంట రాదు. ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకుని మా పొలాలకు సాగు నీరు అందించి ఆదుకోవాలి.

–ఈరన్న, రైతు

నీరు అందక పోతే పంట రాదు



ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పంటకు సాగునీరు ఎంతో అవసరం. ఇప్పుడు నీరు అందక పోతే పంట అంతతాలుగా మారుతుంది. మూడు నెలల నుంచి కష్టపడిన శ్రమ తమ కళ్లముందే వృథా అవుతుంది. పూర్తిగా నష్టపోతాము. ఈ విషయాన్ని అధికారులు, నాయకులు స్పందించి మాలాంటి రైతులను ఆదుకోవాలి.

–బసవరాజు, రైతు

ఏ కాలువకు లేని వారబందీ ఇక్కడేనా?



ఏ కాలువకు లేని వారబందీని కౌతాళం మేజర్ కాలువలో పెట్టిరు. నేను బదినేహాల్ కాలువకింద ఐదు ఎకరాలు, ఉప్పరహాల్ కాలువ కింద 3ఎకరాలను కౌలుకు తీసుకుని సాగుచేశాను. అక్కడ ఒక్కరోజు కూడా కాలువకు నీరు బంద్ కాలేదు. ఈ కాలువకు వారానికి రెండున్నర రోజులు అంటు శనివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు బంద్ చేస్తున్నారు. ఈ కాలువ కింద ఒక ఎకరా కౌలుకు చేశాను. ఈ కాలువలో అంత డబ్బు మహిమ ఉంది. డబ్బులు ఇస్తేనే నీరు వస్తున్నాయి.

–లింగన్న, రైతు

పొలాలకు నీరందిస్తాం

ఎల్లెల్సీ కాలువ కింద నీటి కోసం ఎక్కడా డబ్బులు వసూలు చేయలేదు. నీరు అందలేని పొలాలకు రెండు రోజుల్లో సాగునీరు అందిస్తాం. పొలాలు ఎండి పోకుండా చూస్తాం.

– ఈశ్వర్, టీబీపీ ఏఈ

క్లుప్తంగా

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. అలాగే మండల కేంద్రమైన కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేపట్టారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఫార్మసీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎం. వాగేష్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ బీ–ఫార్మసీ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్, చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ప్రెసిడెంట్ బ్రహ్మచారి నారాయణ చైతన్య, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎం. వాగేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవన నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సామాజి,క వృత్తి పరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు రాజశేఖర్, వెంకటేష్, అనంతప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

ఆదోని టౌన్: పట్టణంలో ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈనెల 22వ తేదీన నిర్వహించాల్సిన వేలం పాటలు ఈనెల 25వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల వేలంపాటలు వాయిదా పడ్డాయన్నారు. ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు చేపడతామన్నారు.

కౌతాళంలో 27న వేలం పాటలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 27న దినసరి మార్కెట్, బండిమెట్ట, కమేశాకు సంబంధించి బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ శనివారం తెలిపారు. ఈ వేలం పాటలు డీఎల్‌పీఓ నూర్జహాన్, గ్రామ కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో కొనసాగుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు పంచాయతీ నిబంధనలకు లోబడి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

నాటుసారా నిర్మూలనకు కృషి చేయండి

మంత్రాలయం: నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పి.తాండ, యం.తాండ గ్రామాల్లో నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి నాటుసారా వల్ల కలిగే అనర్థాలు, నష్టాలను గురించి వివరించారు. తయారీదారులు కుడా పూర్తిగా మానేయాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యునియన్ జనరల్ బాడీ సమావేశం యునియన్ నాయకుడు భీమేష్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో జీఓ నంబర్ 41ని తక్షణం రద్దు చేయాలన్నారు. అనంతరం యునియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడిగా పి.నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులుగా అంజిబాబు, భీమేష్ చౌదరి, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్, జావిద్, యునుస్‌బాషా, రామాంజినితో పాటు 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఎమ్మిగనూరు అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రవీణ్‌కుమార్, జావిద్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యునియన్, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయం ముట్టడి


ఎంవీఐ సిసిరాదీప్తికి వినతి పత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు, నాయకులు

ఆదోని రూరల్: డ్రైవింగ్ టెస్టు, వాహనాల ఫిట్‌నెస్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.హనుమంతు, ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న మాట్లాడుతూ ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ సిస్టం ద్వారా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ చేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సందర్భంగా ఎంవీఐ సిసిరాదీప్తికి వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్,గోవిందు రమేష్, ఈరన్న, చంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని శనివారం తహసీల్దార్ కుమారస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందుకు కార్యాలయానికి వచ్చిన ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడుకుండా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శిరీష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

అంగన్‌వాడీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కౌతాళం: అంగనవాడీల్లో గర్భిణుల నుంచి బాలింతలు, 0–6 సంవత్సరాల పిల్లల వరకు అనేక సేవలను అందిస్తున్నారని, వాటిని అంగన్‌వాడీ సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇన్‌చార్జి సీడీపీఓ నరసమ్మ తెలిపారు. మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రాథమిక పాఠశాలలో మండల అంగనవాడీ కార్యకర్తలు, ఆయాలకు పోషణ్ భీ–పఢాయి భీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ నరసమ్మ మాట్లాడుతూ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తమ పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలను సేకరించాలన్నారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారికి చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ సూపర్‌వైజర్లు వీర గోవిందమ్మ, అఖిల ప్రియ పాల్గొన్నారు.

పోషణ్ భీ..పఢాయి భీ పై శిక్షణ

కోసిగి: స్థానిక కస్తూరీబా గాంధీ బాలికల పాఠశాలలో పోషణ భీ, పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ బాయి, క్యాతాయిని మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంపూర్ణ పోషణ, సంపూర్ణ చదువును అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు.


కౌతాళంలో మాట్లాడుతున్న సీడీపీఓ నరసమ్మ

ఎమ్మిగనూరుటౌన్: పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు పోషకాహారం అవసరమని సీడీపీఓ సఫరున్నీసా బేగం అన్నారు. శనివారం పట్టణంలోని గుడ్ బేస్ స్కూల్‌లో 'పోషణ్‌బీ–పఢాయి భీ' అన్న అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో చివరి రోజు ఆమె పాల్గొన్నారు. పోషకాహారం గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. స్థానిక సూపర్‌వైజర్లు నీలమ్మ, వైలావతి, గురుశేఖరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోషణ్‌భీ పఢాయి భీ' అనే అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమానికి సీడీపీఓ సఫరున్నీసా బేగం హాజరై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. ప్రధాన రోడ్లు, గల్లీ రోడ్లు, మురుగువాడల్లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేసి అపరిశుభ్రం చేయవద్దని సూచించారు. శనివారం రైల్వేస్టేషన్ రోడ్డు, బీఎస్ రోడ్, పాత బస్టాండు, హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రధాన మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. ఏరోజుకారోజు శుభ్రం చేయడంలో శానిటరీ వర్కర్లు ఎందుకు విఫలమయ్యారంటూ నిలదీశారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, సందుల్లో మురుగు కాలువలను ఏరోజుకారోజు శుభ్రం చేయాలని ఆదేశించారు. పాత బస్టాండు, రైల్వేస్టేషన్ రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.


రైల్వే ట్రాక్ పక్కన మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

వేతనాలడిగితే విధుల నుంచి తొలగించారు


డీఎల్‌పీవో నూర్జహాన్‌కు సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు అనీల్

మంత్రాలయం: 11 నెలలుగా తాము వెట్టిచాకిరీ చేశామని, తమకు రావాల్సిన వేతనాలు ఇవ్వాలని ప్రశ్నిస్తే విధుల నుంచి తొలగించాలని, తమకు న్యాయం చేయాలంటూ మంత్రాలయం పారిశుద్ధ్య కార్మికులు డీఎల్‌పీవో నూర్జహాన్‌ను కోరారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు, కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం ఈవోపీఆర్డీ, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు డీఎల్‌పీఓ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో షెడ్డు నిర్వహణ, తడిచెత్త, పొడిచెత్త ఇంటింటా సేకరణ అంశాలపై శిక్షణ కల్పించారు. సమావేశం వద్దకు వచ్చిన పంచాయతీ సిబ్బంది, సీపీఎం నాయకుడు అనిల్ తమ గోడును డీఎల్‌పీఓకు వివరించి, వేతనాలు అందించి తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వెంటనే సమస్యను పరిష్కారించే విధంగా చూడాలని కార్యదర్శి నాగరాజును డీఎల్‌పీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీలు ప్రభావతి, హారున్‌రషీద్, విజయలక్ష్మి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు సేవలు


కన్నడ భక్తులకు అన్నదానం చేస్తున్న భక్తులు


పోనకలదిన్నెలో పాదయాత్ర భక్తులకు ఉచిత మందులు అందజేస్తున్న దృశ్యం


ఆదోనిలో భక్తులకు అన్నదానం చేస్తున్న సేవకులు

నందవరం : ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున సామివార్లను దర్శించుకునేందుకు కాలినడక వెళుతున్న కర్ణాటక, స్థానిక భక్తులకు నందవరం మండలంలో దాతల సహకారంతో అన్నదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గత వారం రోజులుగా సేవలు అందిస్తున్నారు. మండల కేంద్రంలో వీరశైవ లింగాయతీ సంఘం ఆధ్వర్యంలో పెద్దలు, భక్తులు కన్నడిగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే పోనకలదిన్నెలో శ్రీశైలం పాదయాత్ర భక్తులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్ఎంపీలు శ్రీధర్ స్వామి, షఫీల నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులు మందులు పంపిణీ చేస్తున్నారు. ఉగాది పండుగకు కన్నడ భక్తులు శ్రీశైల భ్రమరాంబాదేవికి పుట్టింటి చీర, సారెలు తీసుకెళ్లడం ఆనవాయితీ. భక్తుల రద్దీ పెరగడతంతో ఉచితంగా మందులు, అన్నదానం కార్యక్రమాలు విస్తృతం చేశారు. మండలంలో జోహరాపురం, నాగలదిన్నె, సోమలగూడూరు తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు, తాగునీటి వసతి వంటి ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ తక్కువ కావడంతో అన్నదాన కేంద్రాలను తీసివేస్తున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, గ్రామస్తులు తెలిపారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం

ఆదోని అర్బన్: ఉగాది పండగను పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం ఆదోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శ్రీశైలం భ్రమరాంబామల్లికార్జునస్వామివారి దర్శనం కోసం పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు రెండో రోజూ శనివారం అన్నదాన కార్యక్రమం కొనసాగింది. దాతల సాయంతో కార్యక్రమం నిర్వహిస్తున్న నిర్వాహకుడు మహర్షి విజయ్‌కుమార్ ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. నేటితో పాదయాత్రగా వెళ్లే భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ ముగుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణంలోని షరాఫ్ బజార్, శిల్పా కాలనీ, గోనెగండ్ల రోడ్, సోగనూరు రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించి ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని సూచించారు.

నేడు ముగతి పేటలో నీటి సరఫరా నిలిపివేత

పట్టణంలోని 4వ వార్డు ముగతిపేట, ఎన్టీఆర్ కాలనీల్లో మంచినీటి పైపులైన్ మరమ్మతులు చేపడుతుండటంతో ఆదివారం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శనివారం తెలిపారు. మరమ్మతుల తరువాత సోమవారం యథావిధిగా మంచినీటి సరఫరా చేస్తామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

నందవరం : మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో జగనన్న కాలనీలోని ప్లాట్ల విషయంలో ఇరువర్గాలు ఘర్షణ చోటుచేసుకుంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీలకు 38 ప్లాట్లు కేటాయించింది. ఈ ప్లాట్ల విషయంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఒక కుటుంబానికి పట్టా ఎక్కువ వచ్చినట్లు గుర్తించారు. ఆ పట్టాను రద్దు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అక్కడి చేరుకున్న బాధితుడు షకీరప్ప తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరుతుండగా.. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు వచ్చి పట్టా ర ద్దుచేయాల్సిందేనని వాగ్వాదం చేశారు. మాటా మాట పెరిగి దాడి చేశారు. దాడిలో గాయపడిన ష కీరప్పను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ అధికారులు విచారణ చేస్తున్నపటికీ ఇలాంటి దాడులకు పాల్పడడం విచారకరం.


పట్టణంలోని పెద్ద పార్క్ రోడ్డులో తాటిముంజలను విక్రయిస్తున్న దృశ్యం

ఠండా.. ఠండా.. తాటిముంజల్

ఎమ్మిగనూరుటౌన్: ఒక పక్క మండు వేసవి తాండవిస్తోంది.. మరో పక్క ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. రోజూ 40 డిగ్రీల వరకు నమోదవుతూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ప్రజలకు ఎండ వేడిమికి అల్లాడుతున్నారు. ఉపశమనం ఎక్కడ దొరుకుతుందా అంటూ పరిగెడుతున్నారు. ఇలాంటి వారిని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి ఠండా ఠండా తాటిముంజలు. తినగానే చల్లదనమిస్తూ ఉపశమనం కలిగిస్తాయి. వేసవిలో దొరికే ఈ ఐస్‌యాపిల్ మంచి చలువదనమే కాకుండా పోషకాలు లభిస్తుండటంతో వాటిని ఆరగించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రంగు, రుచి ఆకారం చూసి ఆంగ్లేయులు దీనికి ఐస్ యాపిల్ అని నామకరణం చేశారట. ఈ వేసవిలో ముంజల వ్యాపారం పట్టణంలో జోరుగా సాగుతోంది. పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పెద్ద తుంబళం, మేక డోన తదితర ప్రాంతాల నుంచి తాటి ముంజలను తెచ్చి వ్యాపారులు విక్రయిస్తున్నారు. డజన్ రూ.80 చొప్పున అమ్ముతున్నారు. దీంతో పట్టణ వాసులేకాకుండా గ్రామాల నుండి వచ్చే వారుకూడా ఇష్టంగా కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

పోషకాల పెట్టె

తాటి ముంజల్లో పోషకాలు ఎక్కువగా వుంటాయి. 100 గ్రాముల తాటిముంజెల్లో 43 కాలరీల శక్తి వుంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇందులో విటమిన్–ఏ సమృద్ధిగా లభిస్తుంది. అదేవిధంగా బీ, సీ విటమిన్లు వుంటాయి. ఇందులో పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పాటు నిస్తుందని వైద్యులు సూచిస్తుంటారు. శరీరంలోని విషతుల్యాలను బయటికి పంపుతుంది. ఐరన్, కాల్షియం వంటి ఖనిజలవణాలు ఇందులో వుంటాయి. ముంజల్లో అధిక శాతం నీరుండటం వల్ల డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. వేసవిలో ముంజెలను తినడం ద్వారా శరీరంలోని ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చు. తాటి ముంజెల పొట్టులోనూ అధిక పోషకాలుంటాయంటారు. వీటితో కాలేయ సంబంధ వ్యాధులు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

వ్యాపారం బాగుంది



ఈసారి ముంజెళ్ల వ్యాపారం బాగుంది. పెద్దకడుబూరు మండలం మేకడోన గ్రామంలో రూ.38వేలకు 50 తాటి చెట్లు తీసుకొన్నా. రోజు రెండు గుత్తులు కోసుకొని ఆటోలో తీసుకొని వచ్చి విక్రయిస్తున్నా. దిగుబడులు అంతంత మాత్రంగానే వున్నాయి. ఎండలు ముదురుతుండటంతో ప్రజలు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. రోజు కూలీ గిట్టుబాటు అవుతుంది.

– రాజు, తాటిముంజెళ్ల వ్యాపారి, పొల్లపల్లె గ్రామం

క్షయవ్యాధి వ్యాప్తిని అరికడదాం


మాట్లాడుతున్న ఎంపీహెచ్ఎస్ బాబురాజు

ఆదోని టౌన్: క్షయవ్యాధి వ్యాప్తిని జాగ్రత్తలతో అరికట్టవచ్చని ఎంపీహెచ్ఎస్ బాబురాజు తెలిపారు. శనివారం పట్టణంలోని ఫరీదాసాహెబ్‌మొహల్లా ఉర్దూ స్కూల్, వెంకన్నగిరి ఎలిమెంటరీ స్కూల్‌లో జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమం హెచ్ఎం టి.జె.ఓబేదూర్ రహమాన్, ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీహెచ్ఎస్ మాట్లాడుతూ క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గులో రక్తపు చారలు, ఆకలి తగ్గివడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులతో పాటు ప్రతినెలా రూ.1000 చొప్పున ఆరు నెలలపాటు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుబ్బమ్మబాయి, లలితమ్మ, పాఠశాల సిబ్బంది రఫయ్య, జబీన్ పాల్గొన్నారు.